
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 26 । జూలై । 2024



సోమశిలలో 9.670 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం సాయంత్రానికి 9.645 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.70,440
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,360
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,551
నవర (8 గ్రాములు)	రూ.52,408

గరిష్టం/కనిష్టం
34.6 /29.0

వాతావరణం

గాలిలో తేమ 57 శాతంగా గురువారం నమోదైంది. శుక్రవారం జిల్లాలో వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

రోగులకు నాణ్యమైన వైద్యసేవలు

• సీనియర్ సివిల్ జడ్జి వాణి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

నెల్లూరు(అర్బన్): రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి సర్వజన ఆస్పత్రిలోని డాక్టర్లకు సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ యామిని ఆదేశాల మేరకు జడ్జి వాణి గురువారం దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని మానసిక రోగుల వార్డును సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్యసేవలు, మందుల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం పొందడం రోగుల హక్కన్నారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా కనీస వసతులు, వైద్యసేవలు అందించేందుకు హాస్పిటల్ అధికారులు కృషి చేయాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి సహకారం అవసరమైనా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ ఎంసీఎస్ నాయుడు, డిప్యూటీ సూపరింటెండెంట్ పద్మావతి, డాక్టర్ రాధ తదితరులు మాట్లాడారు.

అటవీ శాఖ ఎఫ్‌బీఓ సస్పెన్షన్

ఆత్మకూరు: అక్రమంగా ఎర్రచందనం తరలించే విషయంలో సహకరిస్తున్న బేస్ క్యాంపు సిబ్బంది గురించి సమాచారం ఉన్నతాధికారులకు చెప్పనందుకు ఆత్మకూరు అటవీ శాఖ రేంజ్ కేఎన్ పరిధిలోని నార్త్‌బీట్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) పి.సంపత్ కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్ గురువారం సాయంత్రం ఎఫ్‌బీఓను సస్పెండ్ చేశారు. రెండు రోజుల క్రితం ఆత్మకూరు అటవీ శాఖ రేంజ్ పరిధిలోని ముగ్గురు వాచర్లు ఎర్రచందనాన్ని తరలించే వారికి సహకరిస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం తెలిసిందే. వారిలో ఒక వాచర్ పారిపోయాడు.

అధికార పార్టీ నీడలో ముక్తియార్?



మంత్రి నారాయణతో మాట్లాడుతున్న డీఈఈ ముక్తియార్

సంగం: అధికార పార్టీ నేతల అండదండలు ఉంటే దొంగ కూడా దొర అవుతారనే దానికి నిదర్శనంగా సంగం గృహ నిర్మాణ సంస్థలో చోటు చేసుకున్న ఉదంతమే రుజువు చేస్తోందని విమర్శలు వస్తున్నాయి. అక్కడ జరిగిన సిమెంటు, స్టీలు కుంభకోణంలో ఏఈ కరిముల్లాను సస్పెండ్ చేసి.. కుంభకోణంలో ప్రధానపాత్ర పోషించిన డీఈఈ ముక్తియార్‌ను మాత్రం ఇన్‌చార్జిగా నియమించడం తెలిసిందే. ఈ ముక్తియార్ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులతో రహస్య మంతనాలు సాగించి కేసు నుంచి తప్పించుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు.

ఇంజినీరింగ్ సహాయకుల పేర్లతో మోసం

తమ లాగిన్ నుంచి సీఆర్‌ఓ (సిమెంట్ రిలీజింగ్ ఆర్డర్)లు తీసి సిమెంట్ కుంభకోణానికి పాల్పడ్డారని అప్పట్లో సంగంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ సహాయకులు ఎంపీడీఓ గోపికి ఫిర్యాదు చేశారు. తమ లాగిన్ల పాస్‌వర్డ్‌లు అధికారికంగా అడిగితే చెప్పామని, వాటి ద్వారా తమకు తెలియకుండానే లబ్ధిదారుల పేరుతో సీఆర్‌ఓలు తీసి బహిరంగ మార్కెట్‌కు తరలించారని ఆనాడు వాపోయారు. దీనిపై జరిగిన విచారణలో ఈ సీఆర్‌ఓలు ఆత్మకూరు హౌసింగ్ నిర్మాణ సంస్థ డీఈఈ కార్యాలయంలో జరిగినట్లు అప్పట్లో తేల్చారు.

కేసు నుంచి బయటపడాలని..

సిమెంటు, స్టీలు కుంభకోణంలో తన పాత్ర బయట పడుతుందన్న భయంతో ముక్తియార్ అధికార పార్టీ నేతల సహాయం అర్థించినట్లు తెలుస్తోంది. టీడీపీకి చెందిన మైనారిటీ వర్గ జిల్లా నేత సహాయంతో జిల్లాకు చెందిన మంత్రుల వద్దకు ముక్తియార్ వెళ్లి మాట్లాడారని తెలిసింది. ఈ కేసు నుంచి తనను బయట పడేయాలని ప్రార్థించినట్లు తెలిసింది.

ఆవేదనలో లబ్ధిదారులు

సంగం మండలంలో జగనన్న ఇళ్ల లబ్ధిదారుల పేర్లతో వారికి తెలియకుండానే సీఆర్‌ఓలు తీసుకుని సిమెంటు, స్టీలు అమ్మిన విషయం బయటకు రావడంతో ఇళ్ల లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. తమ సిమెంట్ తమకు ఎప్పుడు ఇస్తారో ఇళ్లు ఎప్పుడు పూర్తవుతాయో అని ఆవేదన చెందుతున్నారు.

నిధుల మేత.. నాణ్యత కోత

కావలి–సీతారామపురం 167 బీజీ జాతీయ రహదారి మెట్ట ప్రాంత ప్రజల శతాబ్దాల కల. దీనికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్యరూపం దాల్చుతూ నిధులు మంజూరయ్యాయి. పనులు జరుగుతున్నాయి. అయితే రోడ్డు నిర్మాణంలో నిబంధనలు పాటించకుండా కాంట్రాక్టర్ ఇష్టానుసారం పనులు చేస్తుండడంతో నాణ్యత లోపించి మూణ్నాళ్ల ముచ్చటగా మారే ప్రమాదం పొంచి ఉంది. ఎన్‌హెచ్ 16ను అనుసంధానం చేస్తూ కావలి, ఉదయగిరి నియోజకవర్గాల మెట్ట పల్లెలను కలుపుతూ రాయలసీమ, కర్ణాటక రాష్ట్రాల రవాణాకు అత్యంత కీలకమైన రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రశ్నార్థకమైంది. దీంతో ప్రజల్లో ఆందోళన, ఆగ్రహాలు వ్యక్తమవుతున్నాయి.

- హైవే పనుల్లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం
- రోడ్డు నిర్మాణంలో నాసిరకం మట్టి
- అక్కడక్కడా కుంగుతున్న ఫైనం
- వంతెనలు, కల్వర్టు పనుల్లోనూ అదేతీరు
- మట్టి కోసం విచ్చలవిడిగా చెరువుల్లో తవ్వకాలు
- ఉన్నతస్థాయి అధికారులు హెచ్చరించినా మారని తీరు
- నాసిరకం పనులపై స్థానిక ప్రజల ఆందోళన



హైవే నిర్మాణానికి టిప్పర్‌తో తోలుతున్న తువ్వమట్టి

ఉదయగిరి: నెల్లూరు, వైఎస్సార్, ప్రకాశం జిల్లాలను కలుపుతూ చెన్నై, కోల్‌కతా జాతీయ రహదారిని అనుసంధానిస్తూ కావలి నుంచి దుత్తలూరు వరకు 67.4 కి.మీ మేర రూ.450 కోట్లతో ఎన్‌హెచ్ 167బీజీ రహదారి నిర్మాణం జరుగుతోంది. ఈ పనుల్లో జలదంకి వద్ద బైపాస్ నిర్మాణంతోపాటు పలు చోట్ల వంతెనలు, కల్వర్టులు నిర్మిస్తున్నారు. ఈ పనుల్లో నాణ్యత లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులు నాణ్యత ప్రమాణాలు సక్రమంగా లేవంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా కంట్రాక్టరు తీరులో మార్పు కనిపించలేదు.

నాణ్యత లేని మట్టి

అత్యంత కీలకమైన ఈ రోడ్డు నిర్మాణంపై స్థానికుల్లో ఆనందం కనిపించినా.. నాణ్యత లోపంపై ఆందోళన వ్యక్తమౌతోంది. రోడ్డు నిర్మాణం కోసం వాడాల్సిన గ్రావెల్‌లో పూర్తిగా నాణ్యత లోపించిందనే విమర్శలున్నాయి. స్థానికంగా ఉన్న చెరువుల్లో విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలు జరిపి క్వాలిటీ లేని మట్టి రోడ్డు నిర్మాణంలో వాడారు. దీంతో చెరువులు గుంతలుగా మారి ప్రమాదకరంగా మారడమే కాకుండా అక్కడక్కడ రోడ్డు కుంగిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కాంక్రీట్ పనుల్లోనూ అంతే..

ఈ రోడ్డు నిర్మాణంలో చాలా చోట్ల వంతెనలు, కల్వర్టులు నిర్మిస్తున్నారు. కానీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదనే విమర్శలున్నాయి. స్థానికంగా దొరికే నాణ్యత లేని కంకర వినియోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో స్ట్రక్చర్స్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా ఉందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. గతంలో కూడా ఢిల్లీ నుంచి తనిఖీ అధికారులు నాణ్యతపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయ్యప్పరెడ్డిపాళెం వద్ద స్ట్రాంగ్‌గా ఉన్న సీసీ రోడ్డు తీసివేసి తారురోడ్డు వేశారు. రోడ్డు లెవలింగ్‌లో ఉన్న మార్పుతో సీసీ రోడ్డు తీసి, తారురోడ్డు వేశామని అధికారులు చెబుతున్నా స్థానికులు మాత్రం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణంలో ఉన్న డ్రెయిన్స్ సక్రమంగా లేవని, ఇళ్లలో నుంచి నీరు సజావుగా బయటకు వెళ్లే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు. జలదంకి వద్ద కొత్తగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డులో నాణ్యమైన గ్రావెల్ వాడలేదని, రోలింగ్, క్యూరింగ్ సక్రమంగా లేదని ఆరోపిస్తున్నారు. వంతెనలు, కల్వర్టులు వద్ద రోడ్డు, సిమెంట్ స్ట్రక్చర్ల మధ్య గ్యాప్‌తో వాహనదార్లు ఇబ్బంది పడుతున్నారు. అదే విధంగా మట్టి నిర్మాణంలో క్యూరింగ్, రోలింగ్ సక్రమంగా చేయలేదు. సైడ్ బర్మ్‌లు కొద్దిపాటి వర్షాలకే కోసుకుపోతున్నాయి. అదే విధంగా వింజమూరు–దుత్తలూరు మార్గంలో బర్మ్‌ల వద్ద చిల్లచెట్లు పెరిగి రోడ్డుపైకి రావడంతో వాహనదార్లు ఇబ్బంది పడుతున్నారు.



జలదంకి బైపాస్‌లో వంతెన వద్ద రోడ్డుకు వాడిన నాసిరకం గ్రావెల్

లోపాలను సరిచేస్తున్నాం

రోడ్డు నిర్మాణం నాణ్యతగానే జరుగుతోంది. గ్రావెల్ మంచిదే వాడుతున్నాం. నాసిరకం వాడటం లేదు. సిమెంట్ నిర్మాణాలు సక్రమంగా చేస్తున్నాం. లోపాలు ఉంటే వెంటనే సరి చేస్తున్నాం. నాణ్యత విషయంలో రాజీ ఉండదు.

– అనిల్‌కుమార్, డీఈ, నేషనల్ హైవే

ఫోర్జరీ కేసులో దర్యాప్తు ముమ్మరం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు కార్పొరేషన్‌లో కమిషనర్ సంతకాల ఫోర్జరీ కేసులో నిజాలు నిగ్గు తేల్చేందుకు పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసు విషయంలో సస్పెండైన నలుగురు ఉద్యోగుల వివరాలను పోలీసు అధికారులు గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆరా తీశారు. నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి కమిషనర్ సూర్యతేజను కలిసి ఉద్యోగుల వివరాలు కావాలని కోరారు. మేనేజర్ ఇనాయతుల్లాను కలిసి తీసుకోవాలని ఆయన సూచించగా డీఎస్పీ వెళ్లి ఉద్యోగుల వివరాలను అడిగి తీసుకున్నారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి వారు వ్యవహారశైలి, పనితీరు, సర్వీసు రిజిస్టర్లలో వారిపై ఏమైనా రిమార్కులు నమోదయ్యాయా అనే విషయాలు తెలుసుకున్నారు.

అదనపు పొగాకు అమ్మకాలకు పెనాల్టీ లేదు

మర్రిపాడు: 2023–24 పంట కాలానికి రైతులు పండించిన అదనపు పొగాకును ఎటువంటి పెనాల్టీ లేకుండా అమ్ముకునేందుకు పొగాకు బోర్డు అనుమతి ఇచ్చిందని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పెనాల్టీ లేకుండా అనుమతి ఇవ్వడం వల్ల ప్రతి పొగాకు రైతుకు లాభం చేకూరుతుందని తెలిపారు. రైతుల వద్ద ఉన్న అదనపు పొగాకు వివరాలను బోర్డును సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2024–25 పంట కాలానికి ఎరువులు కావాల్సిన రైతులు పొగాకు బోర్డులో ఇండెంట్ ఇవ్వాలని కోరారు. వచ్చే పంట కాలానికి సీటీఆర్ఐ, కందుకూరులో పొగాకు విత్తనాలు ఇస్తున్నారని తెలిపారు.

ప్రకృతి వనరుల దోపిడీ



కొత్తపల్లి చెరువులో గ్రావెల్ తవ్వకాలు

- కావలిలో టీడీపీ నాయకుల ఇష్టారాజ్యం
- యథేచ్ఛగా గ్రావెల్, ఇసుక అక్రమ తవ్వకాలు
- కళ్లు మూసుకున్న మైనింగ్ అధికారులు
- అంతర్గతంగా పోలీసుల సహకారం



పైడేరు వాగులో ఇసుక తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కావలి నియోజకవర్గంలో గ్రావెల్, ఇసుక అక్రమ తవ్వకాలు ఊపందుకున్నాయి. అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు, మీడియా, సోషల్ మీడియా పేరుతో మరికొందరు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి ఇష్టారాజ్యంగా గ్రావెల్, ఇసుక కొల్లగొడుతున్నారు. జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లతో రాత్రి, పగలు తేడా లేకుండా ప్రకృతి వనరులను దోచేస్తున్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అధికారిక అనుమతులు లేకుండా ఒక్కో ట్రిప్పునకు ఇంత అని వసూలు చేస్తూ చెరువులు, భూములు, కాలువలను తవ్వేస్తున్నారు. అక్రమ తవ్వకాలను అడ్డుకోవాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలు, స్థానిక సంస్థల అధికారులు చోద్యం చూస్తున్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లతో అధికారులెవరూ అక్రమ తవ్వకాల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఇంటికి కూత వేటు దూరంలోని కావలి ముసునూరు చెరువులో వారం రోజుల నుంచి ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్నారు. జేసీబీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు వినియోగించి చెరువును గుల్లగుల్లగా చేస్తున్నారు. గ్రావెల్ తవ్వకాల కారణంగా చెరువులో ఏర్పడుతున్న గోతులు వర్షాకాలంలో ప్రమాదకరంగా పరిణమించే ప్రమాదం ఉన్నా పట్టించుకోవడం లేదు. అక్రమాలు సహించం అంటూ పదే పదే చెప్పే కావలి ఎమ్మెల్యే ఇంటికి సమీపంలోనే జరుగుతున్న తవ్వకాలపై అటు ఎమ్మెల్యే, ఇటు అధికారులు నోరుమెదపకపోవడం విశేషం. అలాగే కావలి మండలం కొత్తపల్లి చెరువులో జేసీబీలను దింపి దర్జాగా గ్రావెల్ కొల్లగొట్టే కార్యక్రమం యథేచ్ఛగా కొనసాగుతోంది. అలాగే అల్లూరు మండంలోని పైడేరు వాగులో జేసీబీలతో ఇసుక తవ్వకాలు బాహాటంగానే చేస్తున్నారు. వాగులోనే ఇసుక స్టాక్ పాయింట్‌ను చేసుకొని, ట్రాక్టర్లను తీసుకెళ్లి తరలించే దందా నిర్విఘ్నంగా సాగుతోంది. ఇసుక తవ్వకాల వల్ల పైడేరు వాగు కట్ట బలహీన పడితే వర్షాలు, వరదలు వచ్చినప్పుడు కావలి, కోవూరు నియోజకవర్గాల్లోని వరి సాగులో ఉన్న వేలాది ఎకరాలు మునిగి పోయే ప్రమాదం ఉంది. కావలిలో జరుగుతున్న గ్రావెల్, ఇసుక దందా వ్యవహారాలకు పోలీసులు కూడా లోపాయికారిగా సహకరిస్తున్నట్లు తెలుస్తోంది.

రెండో విడత ఐటీఐ కౌన్సెలింగ్ రేపు

నెల్లూరు (టౌన్): 2024–25 సంవత్సరానికి సంబంధించి స్థానిక వెంకటేశ్వరపురంలోని బాలుర ఐటీఐలో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 27న తగిన ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని ఉదయం 9 గంటలకు హాజరుకావాలని అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు 28న

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా సీనియర్స్, అండర్–23 క్రికెట్ (మల్టీడేస్) జట్ల ఎంపికలు ఈనెల 28న స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉదయం 9 గంటలకు జరుగుతాయని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డి.నిఖిలేశ్వర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తమ సొంత క్రికెట్ కిట్‌తో, డ్రెస్ కోడ్‌తో, ఇతర ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

31న జాబ్‌మేళా

నెల్లూరు సిటీ: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జూలై 31న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి ఎం.వినయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెజాన్ కంపెనీ వారు చెన్నై, హైదరాబాద్‌లో పని చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ చదివి, 18 సంవత్సరాల వయస్సు దాటిన వారు అర్హులని తెలిపారు. వీరికి జీతంగా రూ.16,780 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 31న స్థానిక ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయం నందు ఉదయం 10.30కు జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

రూ.40 లక్షల విలువైన భూ ఆక్రమణ



ఆదూరుపల్లి గ్రామంలో రహదారి పక్కనే టీడీపీ నాయకుడు ఆక్రమించిన విలువైన స్థలం

• ఆదూరుపల్లిలో టీడీపీ నాయకుడి దందా

ఆత్మకూరు: నిరుపేదలు నివాసం ఉండేందుకు చిన్నపాటి స్థలంలో గుడిసెలు వేసుకున్నా.. ఇళ్ల నుంచి వెలుపలికి వచ్చేందుకు మెట్లు నిర్మించుకున్నా అధికారులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంటారు. అదే టీడీపీకి చెందిన ఓ వ్యక్తి ఏకంగా రూ.40 లక్షలకుపైగా విలువచేసే ప్రభుత్వ స్థలం ఆక్రమించి చదును చేస్తున్నా పట్టించుకోని వైనమిది. నిత్యం ఆ రహదారి వెంట తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్, తదితర శాఖల అధికారులు ప్రయాణం చేస్తున్నా వారి దృష్టికి ఈ విషయం రాకపోవడం ఆశ్చర్యకరమని ప్రజలు అంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఆత్మకూరు నియోజకవర్గం చేజర్ల మండలంలోని ఆదూరుపల్లిలో ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనే పెట్రోల్ బంకు సమీపంలో టీడీపీకి చెందిన ఓ వ్యక్తి సర్వే నంబర్ 596లో తన సోదరికి ప్రభుత్వం 30 అంకణాల స్థలం మంజూరు చేసిందంటూ ఓ పత్రం సృష్టించాడు. అంతటితో ఆగకుండా ఆ స్థలాన్ని చదును చేస్తూ మరో పది అంకణాలకుపైగా స్థలాన్ని అందులో కలిపి హద్దురాళ్లు వేశాడు. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం చెప్పడంతో ఇది తమదేనని, తన సోదరికి ప్రభుత్వం మంజూరు చేసిందని, కావాలంటే కోర్టు కెళ్లండని దబాయిస్తున్నాడు.

ఎందుకు పట్టించుకోవడం లేదో..

ఆక్రమిత స్థలాన్ని కొద్దిరోజులు ఎవరికీ అనుమానం రాకుండా, ఒకేసారి కాకుండా కొంచెం కొంచెంగా చదును చేస్తూ హద్దురాళ్లు నాటాడు. దీనిపై ఇప్పటికే అధికారులకు ఫిర్యాదులు అందినా వారు పట్టించుకోవడంలేదని గ్రామ ప్రజలు చెబుతున్నారు. పొదలకూరు, కలువాయి రహదారి పక్కనే ఆదూరుపల్లి గ్రామంలో పలు వ్యాపారాలు నిర్వహించే (కమర్షియల్ స్థలం) సుమారు రూ.40 లక్షలకుపైగా విలువైన స్థలాన్ని ఆక్రమిస్తే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. గురువారం ఆక్రమిత స్థలాలను పరిశీలించేందుకు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లిన ఆర్డీఓ మధులతకు ఈ విషయం తెలియదా అని అధికారులు తెలపలేదా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇది కాదా కక్షపూరిత చర్య!

- వైఎస్సార్‌సీపీ మద్దతుదారు ఇంటి ర్యాంపు తొలగించాలట
- అధికారపార్టీ ఒత్తిళ్లకు లొంగిపోతున్న అధికారులు



ఇంటి మెట్లు, ర్యాంపుపై అభ్యంతరం తెలుపుతున్న అధికారులు



పేడ దిబ్బపై ప్రశ్నిస్తున్న ఆర్డీఓ

ఆత్మకూరు: ఇటీవల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేసిన వారి పట్ల టీడీపీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. ఆత్మకూరు నియోజకవర్గం చేజర్ల మండలం తూర్పుకంభంపాడు గ్రామంలో కృష్ణవేణి అనే మహిళ ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా కీలకంగా పనిచేసింది. ఆమెపై కక్ష కట్టిన టీడీపీ నాయకులు ఆమె ఇంటి మెట్లు, వాహనాలు వెళ్లేందుకు నిర్మించిన ర్యాంపు గ్రామకంఠం స్థలంలో నిర్మించారని, వాటిని తొలగించాలని ఒత్తిడి చేశారు. అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి కె.మధులత గురువారం వాటిని పరిశీలించారు. తాను ఇంటిలో నుంచి వెలుపలికి వచ్చేందుకు, వాహనాలు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసుకున్నానని, దీనికే అభ్యంతరం పెడితే తాము రాకపోకలు ఎలా సాగించాలని కృష్ణవేణి ఆర్డీఓతో మొరపెట్టుకుంది. పేడదిబ్బలు వేసిన స్థలం తమ సొంతదని, దానికి అభ్యంతరం ఏమిటని ఆమె ఆర్డీఓను అడిగింది. అయితే వీటిపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని, వాటిని తొలగించాలని ఆర్డీఓ చెప్పారు. కృష్ణవేణి మాట్లాడుతూ సమీపంలోనే బస్సులు ప్రయాణించే ప్రధాన రహదారిలో టీడీపీకి చెందిన చప్పిడి వెంకటేశ్వర్లు, జనార్దన్‌లు ఏకంగా రోడ్డునే ఆక్రమిస్తూ మెట్లు, వాహనాలు వెళ్లేందుకు ర్యాంపు నిర్మించారని అది అభ్యంతరం కాదా అని మధులతను ప్రశ్నించింది. దాంతో ఆర్డీఓ తనకు ఎదురు సమాధానం చెప్పొద్దని, ఆ నిర్మాణాలపై ఎలాంటి అభ్యంతరాలు తమకు రాలేదని కేవలం నీ ఇంటి గురించే అభ్యంతరాలు వచ్చాయని పేర్కొని వారం రోజుల వ్యవధిలో ర్యాంపు, మెట్లు తొలగించాలని ఎంపీడీఓ, ఆర్ఐలను ఆదేశించింది. బాధ్యతగా ఉండాల్సిన అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు లొంగి వ్యవహరించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అనంతరం ఆర్డీఓ పెళ్లేరు గ్రామంలో పెన్నా పోరంబోకులో సాగు చేస్తున్న వేరుశనగ పైరును అధికారులతో కలిసి పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలు గురించి మండలాధికారులకు పలు ఆదేశాలు చేశారు.

క్లుప్తంగా

31న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

నెల్లూరు(టౌన్): పాలిటెక్నిక్‌లో డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు ఈనెల 31న నెల్లూరు వెంకటేశ్వరపురంలోని పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రామ్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీలు రూ.250 ఫీజు చెల్లించాలన్నారు. పాలిసెట్‌లో అర్హత పొందని వారు ఓసీ, బీసీలు రూ.1,100, ఎస్సీ, ఎస్టీలు రూ.350 కట్టాలన్నారు. సీటు పొందిన విద్యార్థులు రూ.4,700 కళాశాల ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు పదో తరగతి మార్కులిస్ట్, టీసీ, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణపత్రాలను తీసుకురావాలన్నారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందిన వారికి ఎలాంటి స్కాలర్‌షిప్‌లు రావని తెలియజేశారు.

బంగారం చోరీ కేసులో మహిళల అరెస్ట్

నెల్లూరు సిటీ: ఓ జ్యువెలరీ షాపులో బంగారు వస్తువులను చోరీ చేసిన ఘటనలో ఇద్దరు మహిళలను నెల్లూరు సంతపేట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. అన్నమయ్య జిల్లాకు చెందిన వేముల గీత, వేముల రెడ్డమ్మ నెల్లూరు చిన్నబజారులో ఉన్న హేమంత్ కుమార్ అనే వ్యక్తికి చెందిన జ్యువెలరీ దుకాణంలో వెండి వస్తువులను కొనేందుకు బుధవారం వెళ్లారు. పాత వెండి వస్తువులను ఇచ్చి రూ.3 వేలు విలువ చేసే కొత్త వెండి పట్టీలు కొన్నారు. ఈ క్రమంలో దుకాణంలోని 7 గ్రాముల బుట్టకమ్మల జతను చోరీ చేశారు. సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించిన దుకాణ నిర్వాహకుడు హేమంత్ సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు. గీతపై అన్నమయ్య జిల్లాలో గతంలో రెండు కేసులు నమోదైనట్లు గుర్తించారు.

సదా చిన్నారుల సేవలో..

ఆరోగ్యానికి భరోసా ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్

- ఉచితంగా రూ.15 లక్షల విలువైన కాక్లియర్ ఇంప్లాంట్స్ ఆపరేషన్
- పుట్టుకతో వచ్చే గుండె లోపాలకు శస్త్రచికిత్సలు
- మాటలు రాని, వినికిడి లోపం ఉన్న వారికి శిక్షణ
- గ్రహణమొర్రి, పెదవి చీలిక, అంగిలి చీలికలకు వైద్యం
- గత ప్రభుత్వంలో వేలాదిమంది చిన్నారులకు లబ్ధి



➡ ఈ చిత్రంలోని చిన్నారి పేరు ఎస్‌కే హర్షద్. పొదలకూరు గ్రామం. తల్లిదండ్రులు షబానా, మస్తాన్‌బాషా. బిడ్డకు రెండేళ్లయినా మాటలు రాలేదు. వినికిడి లోపం ఉంది. దీంతో తల్లిదండ్రులు మనోవేదనకు గురయ్యారు. ఆరునెలల క్రితం నెల్లూరు జీజీహెచ్ అధికారులను సంప్రదించారు. వారు పరిశీలించి రూ.15 లక్షలు ఖర్చయ్యే కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్‌ను గుంటూరులో చేయించారు. అనంతరం హర్షద్‌కు నెల్లూరు డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్‌లో (డీఈఐసీ) శిక్షణ ఇస్తున్నారు. ఇప్పుడు మాట్లాడుతున్నాడు.

నెల్లూరు(అర్బన్): డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్ (డీఈఐసీ).. లోపాలున్న పురిటి బిడ్డల నుంచి బాల బాలికల ఆరోగ్యానికి ఇది భరోసా కల్పిస్తోంది. వారికి అవసరమైన వైద్య చికిత్సలు చేయించి ఆదుకుంటోంది. రూ.15 లక్షల ఖరీదైన కాక్లియర్ ఇంప్లాంట్స్ ఆపరేషన్లు సైతం చేయించి మూగ, చెవిటి లోపాలున్న వారికి సైతం మాటలు వచ్చేలా చేస్తోంది. ఇక్కడ 30 రకాల సేవలను ఉచితంగా అందిస్తారు. ఈ సెంటర్ నెల్లూరులోని సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఉంది. జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా రూపాయి ఖర్చు లేకుండా వైద్యం చేస్తారు. వైద్య సేవలు అందించేందుకు, శిక్షణ ఇచ్చేందుకు చిన్నపిల్లల డాక్టర్, మెడికల్ ఆఫీసర్, దంత వైద్యురాలు, ఫిజియోథెరపిస్ట్, ఆడియాలజిస్ట్ కమ్ స్పీచ్ థెరపిస్ట్, క్లినికల్ సైకాలజిస్ట్, స్పెషల్ ఎడ్యుకేటర్, డెంటల్ హైజెనిస్ట్, ఆప్టోమెట్రిస్ట్, ల్యాబ్‌టెక్నీషియన్, సోషల్ వర్కర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక మేనేజర్, ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ ఉన్నారు.



బాల భవిత కేంద్రంలో చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



➡ ఈ చిన్నారి వయస్సు రెండేళ్లు. ఆరోగ్యం బాగోలేదని తెలుసుకున్న కుటుంబం గూడూరు నిమ్మ మార్కెట్ ప్రాంతంలో వదిలేశారు. ఐసీడీఎస్ అధికారులు ఆ పాపను అక్కున చేర్చుకుని సుశీల అని పేరు పెట్టారు. నెల్లూరు జీజీహెచ్ (పెద్దాస్పత్రి)లో పరీక్షలు చేయించి గుండె సమస్య ఉన్నట్లు గుర్తించారు. చిన్నారికి ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డు, రేషన్‌కార్డులాంటివి లేవు. డీఈఐసీ అధికారులు కలెక్టర్ సహకారంతో తిరుపతిలోని పద్మావతి ఆస్పత్రిలో చేర్పించి సుమారు రూ.2 లక్షల విలువైన ఆపరేషన్‌ను ఉచితంగా చేయించారు.



రెటినోపతి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్లు

వీటికి..

పిల్లల్లో వచ్చే లోపాలు, జబ్బులను ఫోర్ డీస్ (డిఫెక్ట్స్, డిసీజెస్, డిఫార్మిటీస్, డెవలప్‌మెంటల్ డిలేస్)గా గుర్తించి అందుకు తగిన డాక్టర్ల పర్యవేక్షణలో లోపాలున్న పిల్లలకు వైద్య సేవలందించేందుకు ఆర్‌బీఎస్‌కే అధికారులు చర్యలు తీసుకుంటారు. సుమారు 30 రకాల సమస్యలను పిల్లల్లో గుర్తిస్తున్నారు. అందులో ప్రధానంగా న్యూరల్ ట్యూబ్ లోపం, జన్యు లోపం, వంకర పాదాలు, గ్రహణమొర్రి పెదవి చీలిక, అంగిట్లో చీలిక, పుట్టుకతో వచ్చే గుండె లోపాలు, విటమిన్ లోపాలు, తీవ్రమైన రక్తహీనత, దృష్టి, వినికిడి, దంత సమస్యలు, చర్మవ్యాధులు, మాటలు పలకడంలో తేడా, బుద్ధిమాంద్యం, మాటలు నేర్చుకోవడంలో ఆలస్యం, అభ్యసన సమస్యలు, ఆటిజం (ప్రవర్తనా లోపం) గుర్తిస్తారు. వైద్య చికిత్సల ద్వారా కొన్ని జబ్బులను నయం చేస్తారు. మాటలు సకాలంలో మాట్లాడలేకపోవడం, బుద్ధిమాంద్యం లాంటి వాటికి శిక్షణ ఇస్తారు. ఫిజియోథెరపీ చేస్తారు.

ఏం చేస్తున్నారంటే..

పుట్టిన పిల్లల్లో రెటినోపతి ఆఫ్ ప్రీమెచ్యూరిటీ పరీక్షలు చేసి అవసరమైన వారికి లేజర్ చికిత్సలు చేయిస్తున్నారు. మరికొంతమందికి ఒక్కో కంటికి రూ.20 వేల విలువైన ఇంజెక్షన్ వేస్తున్నారు. చెన్నైకి చెందిన రాధాద్రి నేత్రాలయ సంస్థ వారు నెల్లూరు వచ్చి స్క్రీనింగ్ చేసి లోపాలున్న పిల్లలకు ఇలా లేజర్ లేదా ఇంజెక్షన్ చికిత్స చేసి పిల్లల చూపు కోల్పోకుండా కాపాడుతున్నారు.

➡ వందలాది మంది వినికిడి లోపం ఉన్న వారికి హియరింగ్ వస్తువులు అందిస్తున్నారు. అలాగే అవసరమైన పిల్లలకు వీల్‌చైర్స్, సీపీచైర్స్, వంకర పాదాలకు అవసరమైన షూస్ ఇస్తున్నారు. పిండి కట్టు, షూస్ ద్వారా వంకర పాదాలు సెట్ కాకపోతే జీజీహెచ్‌లోనే చికిత్స చేసి సాధారణ పౌరుల్లా నడిచేలా చేస్తున్నారు.

➡ వెన్నుపూసపై గడ్డ, తలపై గడ్డలున్న వారికి నెల్లూరు నారాయణ, తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేయిస్తున్నారు.

ప్రజలు వినియోగించుకోవాలి



పుట్టిన పిల్లల నుంచి 18 ఏళ్ల లోపున్న వారికి ఆరోగ్యం కోసం డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్ పనిచేస్తోంది. సాధారణ ఆరోగ్య సమస్యలతోపాటు ఇతర లోపాలున్న వారికి వైద్యచికిత్సలు అందించడం జరుగుతోంది. బాల భవిత కేంద్రం సేవలు వినియోగించుకోవాలి. అవసరమైన వారికి తిరుపతి, చెన్నై, గుంటూరు లాంటి చోట్ల చికిత్సలు ఉచితంగా అందేలా చేస్తాం.

– డాక్టర్ సుధీర్‌కుమార్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామింగ్ ఆఫీసర్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేసింది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఫలితంగా నివాస ప్రాంతం సమీపంలోనే చిన్నారులను పరీక్షించే అవకాశం ఏర్పడింది. ఇందులో భాగంగా మొదటిదశలో వైద్యులు సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి పిల్లల ఎదుగుదల, వారి ఎత్తుకు తగిన బరువు, హిమోగ్లోబిన్ (రక్తం) తదితర వాటిని పరిశీలించారు. అక్కడ ఏదైనా తేడా గమనిస్తే అలాంటి పిల్లలను పీహెచ్‌సీలకు తీసుకెళ్లి పరీక్షలు చేశారు. అవసరాన్ని బట్టి జీజీహెచ్, బాలభవిత కేంద్రానికి తరలించి అదనపు పరీక్షలు చేయించారు. లోపాలుంటే తగువైద్యం, శిక్షణ ద్వారా నయం చేస్తారు. లోపాలున్న పిల్లలను గుర్తించేందుకు అప్పట్లోనే పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి, జీజీహెచ్ తదితర ఆస్పత్రుల్లో ఉండే డాక్టర్లతోపాటు నర్సింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇందువల్ల గత నాలుగేళ్లలో వేలాది మంది చిన్నారులకు వైద్యసేవలందాయి. 2021 – 22లో 6,432 మంది, 2022 – 23లో 9,200 మంది, 2023 – 24లో 8,543 మంది వివిధ ఆరోగ్య సమస్యలపై చికిత్స పొందారు. అత్యంత ఖరీదైన కాక్లియర్ ఇంప్లాంట్స్ ఆపరేషన్లను 2021 – 22లో నలుగురికి, 2022 – 23లో 8 మందికి, 2023 – 24లో 8 మందికి చేశారు. అంగిలి చీలికతో పాటు పెదవి చీలిక ఉన్న 25 మంది నాలుగేళ్లలో ఆపరేషన్లు చేయించుకున్నారు. వీరికి ఒక్కొక్కరికి రెండు రకాల ఆపరేషన్లకు కలిపి సుమారు రూ.2 లక్షల విలువైన సేవలు ఉచితంగా అందాయి. 2021 – 22లో గుండె సమస్యలున్న ఏడుగురికి, 2022 – 23లో 8 మందికి, 2023 – 24లో 12 మందికి చెన్నైలోని అపోలో హాస్పిటల్లో ఉచితంగా ఆపరేషన్లు చేయించారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి: రూ.55
సన్నవి: రూ.35
పండ్లు: రూ.25

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 127
లేయర్ (లైవ్) : 100
బ్రాయిలర్ చికెన్ : 228
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 254
లేయర్ చికెన్ : 170

అపోలో ఆస్పత్రిలో మెదడుకు అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): మెదడులో తీవ్ర రక్తస్రావమై స్పృహ కోల్పోయిన ఓ వృద్ధుడికి తొలిసారిగా ఎండోస్కోపిక్ పద్ధతి ద్వారా ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడామని అపోలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ శ్రీరామ్ సతీష్ తెలిపారు. నెల్లూరు హరనాథపురంలోని ఆస్పత్రిలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. న్యూరోసర్జన్ డాక్టర్ వెంకట్ మాట్లాడుతూ కందుకూరుకు చెందిన 78 ఏళ్ల వృద్ధుడు సుబ్రహ్మణ్యంకు వైద్య పరీక్షలు చేయగా మెదడులో రక్తస్రావం ఎక్కువగా జరిగి రక్తం గడ్డకట్టిందన్నారు. దీనిని అరుదైన ఆర్టరీ వీన్స్ మాల్‌ఫార్మేషన్‌గా పిలుస్తారన్నారు. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని ఎండోస్కోపిక్ పద్ధతి ద్వారా వృద్ధుడి మెదడులో గడ్డలుగా ఉన్న రక్తాన్ని తొలగించామన్నారు. రెండోరోజుకే ఆయన కోలుకున్నాడన్నారు. తమకున్న సమాచారం మేరకు తొలిసారిగా ఈ పద్ధతిలో ఆపరేషన్ జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజమోహన్‌రెడ్డి, యూనిట్ హెడ్ బాలరాజు పాల్గొన్నారు.

పిల్లల హాజరు శాతం పెంచేలా చర్యలు

- ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ ఆదేశించారు. గురువారం ఆమె నెల్లూరులోని వెంగళరావునగర్ సెక్టార్‌లో ఉన్న అంబేడ్కర్ నగర్, పాత పోలీస్ లైన్ తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు అందిస్తున్న కోడి గుడ్డు సైజు 50 గ్రాములు, ట్రే 1,500 గ్రాములుందా? లేదా? అని పరిశీలించారు. రిజిస్టర్లను చూశారు. అనంతరం పీడీ మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం వండాలని, అంగన్‌వాడీ పరిధిలో ఉన్న మహిళలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిల్లలు భోజనం చేసే ముందు, చేసిన తర్వాత చేతులు శుభ్రం చేసుకునేలా చూడాలన్నారు. కాచి చల్చార్చిన నీటిని మాత్రమే అందించాలని ఆదేశించారు. పిల్లలకు ఎలాంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ లక్ష్మి, సూపర్‌వైజర్ సుకన్య, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



కోడిగుడ్డును పరిశీలిస్తున్న హేనాసుజన్

ఆగని టీడీపీ నాయకుల దౌర్జన్యాలు



దామేగుంట చలివేంద్రంలో జేసీబీతో డ్రైయినేజీ పైప్‌లైన్ తొలగింపు



ధ్వంసం చేసిన పంప్‌షెడ్ (ఫైల్)

- చలివేంద్రంలో డ్రైయినేజీ పైప్‌లైన్ తొలగింపు

కొడవలూరు: మండలంలో టీడీపీ నేతల దౌర్జన్యాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్‌లున్న పంచాయతీల్లో ప్రతి విషయంలో తమ మాటే నెగ్గాలంటూ తెలుగు తమ్ముళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని దామేగుంట చలివేంద్రంలో మురుగునీరు వెళ్లేందుకు రోడ్డు కింద ఏర్పాటు చేసిన డ్రెయినేజీ పైపులను స్థానిక టీడీపీ నాయకులు గురువారం తొలగించారు. ఆ పైప్‌లైన్ స్థానికులకు ఉపయోగకరమైనా ఏర్పాటు చేయించిన వ్యక్తి వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కావడం, గత ప్రభుత్వంలో ఆ పని జరిగి ఉండడంతో ఈ చర్యలకు పాల్పడ్డారు. ఈ విషయమై అక్కడి వారు ప్రశ్నించగా స్థానిక ఎమ్మెల్యేనే చెప్పారని సమాధానమిచ్చారు.

ఇప్పటికే..

ఇదే గ్రామంలో నెలరోజుల క్రితం పబ్లిక్ స్థలంలో ఏర్పాటు చేసిన పంచాయతీ పంప్‌షెడ్‌ను స్థానిక టీడీపీ నేత తన ఇంటి వాస్తుకు భంగం కలిగిస్తోందంటూ ధ్వంసం చేశాడు. పోలీసులకు సమాచారం ఇస్తున్నా ఎలాంటి చర్యలు ఉండడం లేదు. ఈ ఒక్క పంచాయతీలోనే కాక వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లున్న చోట్ల ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కార్యదర్శులు తమకు చెప్పకుండా చిన్నపాటి పనులు కూడా చేపట్టరాదంటూ ఆయా గ్రామాల్లోని తెలుగుదేశం నేతలు హుకుం జారీ చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పేరు చెబుతున్నారు. తెలుగు తమ్ముళ్లు తమ ఆధిపత్యం కోసం వైఎస్సార్‌సీపీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులను బెదిరిస్తున్నారు. కొత్తవంగల్లు, పెమ్మారెడ్డిపాళెం, కమ్మపాళెం తదితరచోట్ల ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

బాలికపై లైంగికదాడి

- ఆలస్యంగా వెలుగులోకి..
- నిందితులపై పోక్సో కేసు

నెల్లూరు సిటీ: ఎనిమిదేళ్ల చిన్నారిపై ఇద్దరు కామాంధులు లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈనెల 21వ తేదీ రాత్రి సమయంలో వెంగళరావునగర్‌కు చెందిన ఓ బాలిక ఇంటి వద్ద ఆడుకుంటోంది. మామయ్య వరుసయ్యే పార్థా అనే వ్యక్తి, అతని స్నేహితుడు సంతోష్ కలిసి బాలికకు మాయమాటలు చెప్పి ఎవరూ లేని ప్రదేశానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న బాధిత కుటుంబసభ్యులు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య



కొడవలూరు: గుర్తుతెలియని వృద్ధుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నార్తురాజుపాళెంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. 60 – 65 సంవత్సరాల మధ్య వయస్సున్న ఓ వృద్ధుడు నార్తురాజుపాళెం దాసరిపాళెం రోడ్డులో పురుగు మందు తాగాడు. అతను చనిపోయి ఉండగా గురువారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వృద్ధుడు బుధవారం అర్ధరాత్రి పురుగు మందును నీటిలో కలిపి తాగి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుడి ఎడమ చేతిపై ఈ.ఈశ్వరమ్మ అని రాసి ఉంది. క్రీమ్ కలర్ బంగారపు రంగు అంచున్న పంచె, గళ్ల చొక్కా ధరించి ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నడిచి వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మర్రిపాడు: రోడ్డుపై నడిచి వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై ఉన్న అచ్చమాంబ గుడికి బోయలచిరివెళ్ల గ్రామానికి చెందిన నరసారెడ్డి (50) నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కిందపడి తలకు తీవ్రగాయమై స్పృహ కోల్పోయాడు. కొద్దిసేపటి అనంతరం సమీపంలో ఉన్న వారు చూసి హైవే అంబులెన్స్‌లో అతడిని ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మమ్మల్ని విధుల నుంచి తొలగించొద్దు



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ నర్సులు

- నిరసన తెలిపిన కాంట్రాక్ట్ నర్సులు

నెల్లూరు(అర్బన్): నేషనల్ హెల్త్ మిషన్ కింద నడుస్తున్న సీమాంక్ సెంటర్లు, నవజాత శిశు సంరక్షణ కేంద్రాల్లో పనిచేస్తున్న తమను విధుల నుంచి తొలగించొద్దని పలువురు స్టాఫ్‌నర్సులు విజ్ఞప్తి చేశారు. నెల్లూరు సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద గురువారం వారు నిరసన తెలిపారు. అనంతరం యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్ మాట్లాడుతూ 15 ఏళ్లుగా జిల్లాలో 26 మంది స్టాఫ్ నర్సులు సీమాంక్ సెంటర్లు, నవజాత శిశు సంరక్షణ కేంద్రాల్లో పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఆ సెంటర్లలో ఎక్కువ భాగం మూసివేతకు చర్యలు తీసుకుందన్నారు. నర్సులను ఆరోగ్య కేంద్రాల్లో సర్దుబాటు చేయాలని ఉన్నతాధికారులు సర్క్యులర్ జారీ చేశారన్నారు. అయినా ఖాళీలు లేవనే సాకుతో ఈనెల 31వ తేదీ నాటికి నర్సులను ఇంటికి పంపించేందుకు జిల్లా వైద్య శాఖాధికారులు చర్యలు చేపట్టడం అన్యాయమన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌డీ సందానీబాషా పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం

- సమాచారం అందిస్తే ప్రోత్సాహకాలు
- ఎస్‌ఈ విజయన్



మాట్లాడుతున్న ఎస్‌ఈ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'విద్యుత్ చౌర్యం నేరం. దీనికి పాల్పడుతున్న వారి గురించి సమాచారం అందిస్తే ప్రోత్సాహక బహుమతులు అందజేస్తాం' అని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ తెలిపారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు దొంగతనం చేయడం, లైన్లకు వైర్లు తగిలించి విద్యుత్ చౌర్యం చేయడం, సర్వీస్ నంబర్ లేకుండా విద్యుత్ వాడడం నేరమన్నారు. ఇలా ఎవరైనా చేస్తుంటే సమాచారం అందించాలని కోరారు. వివరాలు చెప్పే వారి పేర్లు గోప్యంగా ఉంచి, తగిన ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. విద్యుత్ చౌర్యంపై విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి (94408 11787), సబ్ ఇన్‌స్పెక్టర్ పీవీ సుబ్బారావు (94906 15816)కు సమాచారం ఇవ్వాలని కోరారు.